కథ

# భయం

న్యాయపతి కమలారాంజీ

సన్నగా మొదలైన చినుకులు పెద్ద వర్షంగా మారిపోయేయి. వర్షం ఏటవాలుగా, ఉధృతంగా పడుతోంది. ఉన్నట్టుండి కళ్లు మిరుమిట్లు గొలిపేలా మెరుపులు! చెవులు హోరెత్తి పోయేలా ఉరుములు! కిటికీ తలుపులు టపటప కొట్టుకుంటున్నాయి. అంజలి ఆతృతగా వీధి వెపు మాటిమాటికి చూస్తూన్నది.

అర్ధరాత్రి వీధిలో రిక్షా ఆగిన చప్పుడుకి తల్లీ కూతుళ్లిద్దరూ ఆతృతగా కిటికీలోంచి చూసేరు. రిక్షా దిగి అంత వర్షంలోనూ తూలుతూ నడిచి వస్తున్న వ్యక్తిని పోల్చి గబగబా వీధి తలుపుతీసి మెట్లు దిగి ఇద్దరూ చెరొక వైపు సాయంపట్టి అతన్ని లోపలికి తీసుకు వచ్చేరు. అంజలికి లోలోపల భయంగా వుంది. ఇరుగు-పొరుగు ఎవరైనా చూస్తున్నారేమోనని!

అంతటా నిశ్శబ్దంగా వుంది. వాన శబ్దం తప్ప మరే శబ్దమూ లేదు. అందరిళ్లల్లో అప్పటికీ లైట్లార్పేసి వున్నాయి. తమని ఎవరూ చూడ్డం లేదని గమనించి తేలిగ్గా ఊపిరి పీల్చుకుంది అంజలి.

విశాలాక్షికి దుఃఖం ముంచుకొస్తోంది.

''ఏమిటండీ ఇది?'' అందామె ఏడుపు గొంతుతో


''ఎప్పుడూ ఉన్నదేగా అమ్మా!'' అంది అంజలి నిర్లిప్తంగా.

మంచం మీద అస్తవ్యస్తంగా పడుకున్న రామనాథంని ''ఏవండీ! భోం చేస్తారా?'' అని ఆవిడ అడగలేదు.

''నాన్నా! భోం చెయ్యండి'' అని అంజలి కూడా అనలేదు.

ఇద్దరికీ తెలుసు. అతనలా తాగొచ్చాక చచ్చినా భోం చెయ్యడని!

లోలోపల దుఃఖిస్తున్న తల్లిని ఎలా ఓదార్చాలో తెలియక ఒకసారి ఆమె వైపు జాలిగా చూసి తర్వాత తన జాగాలో కొచ్చి పడుకుంది. పడుకుందన్న మాటే గాని నిద్రరాక ఆమె కళ్లు మంట పెడుతున్నాయి. ఆలోచనలు కుమ్మరి పురుగుల్లా ఆమె మనసుని తొలిచేస్తున్నాయి!



నాన్న ఎందుకిలా తయారయ్యేడు? అమ్మ నిజంగా చాలా మంచిది. ఎప్పుడూ ఎదురు జవాబిచ్చి ఎరుగదు. ''ఇది లేదు. అది లేదు'' అని సతాయించదు. ఉన్న దాంట్లోనే క్లుప్తంగా గడుపుకొస్తుంది. అయినా ఇలాంటి పాడు వ్యసనంతోనే నాన్నకి ఉన్న ఉద్యోగం కూడా ఊడింది. ఊర్నిండా అప్పులు! ఎక్కడా తలెత్తుకోలేక.... ఎవరు? నాన్నకేం హాయిగా తలెత్తుకు తిరుగుతున్నాడు. ''షేమ్ లెస్ ప్యూపుల్ ఆర్ ఆల్‌వేజ్ హేపి!'' మధ్యన తను... అమ్మ... తలెత్తుకోలేక, ఎవరింటికి వెళ్లలేక సిగ్గుతో చితికిపోతున్నారు! ఇంత వయసు వస్తే మాత్రం ఏం లాభం? బుద్ధి, జ్ఞానం లేకపోయేక?... అంజలి మనసంతా దిగులుతో నిండి పోయింది. పోనీ తనకైనా ఉద్యోగం వస్తే బాగుణ్ణు! తను బి.ఏ. పాసయింది. మొన్ననే ఇంటర్వ్యూ కెళ్లి వచ్చింది. ఇంటర్వ్యూ బాగానే చేసింది. ఈ ఉద్యోగమైనా తనకొస్తే బాగుండును. తల్లిని, చెల్లెళ్లని, తమ్ముడ్ని ఆదుకోవచ్చు. బాధ్యత మోయాల్సిన తండ్రి బుద్ధి తక్కువగా ప్రవర్తిస్తూ బరువు దించుకోవాలని చూస్తున్నాడు. తన అర్థం లేని తాగుడికీ, బాధ్యతల బరువుకి అనవసరంగా ముడి వేసి ''ఈ బాధల్ని మర్చిపోవడానికే తాగుతున్నానని'' సమర్థించుకుంటున్నాడు. ఇంకా గట్టిగా అడిగితే పెద్దపెద్ద కేకలు వేసి, ఇంట్లో అందర్నీ తన్నినంత పని చేసి ఆఖరికి ''నేను ఏమీ చేతకాని వాడిని. చేతకాని వాడిని. ఇంత విషం ఇచ్చెయ్యండి. చచ్చిపోతాను. నా పీడ విరగడై పోతుంది!'' అని భోరున ఏడుస్తాడు. ఛ అసలు మగాడు అలా ఏడవడం చూస్తే పరమ అసహ్యం వేస్తుంది.

దిగులుతో శుష్కించిన శరీరం, పీక్కుపోయిన దవడలు, లోతుకుపోయిన కళ్లు, ఆలోచనల్ని తాత్కాలికంగా దూరం చేసుకుని నిద్రలోకి జారుకున్న అమ్మని చూస్తే కడుపు తరుక్కుపోయింది అంజలికి.

ఈ సమాజంలో ఎంతమంది తల్లులు ఇలాంటి మూగవేదన అనుభవిస్తున్నారు? ఎంత మంది అబలలు ఎవ్వరికీ వినపడని అరణ్య రోదనలు చేస్తున్నారు?... ఆలోచనలతో తలంతా బరువెక్కి, తలనొప్పి మొదలైంది.... అప్పుడు ఆమెకి తన ఊహాలోకం గుర్తొచ్చింది. ఆ లోకం చాలా అందంగా వుంటుంది!... అనురాగం అందించే భర్త, ముత్యాల్లాంటి పిల్లలు, స్వర్గాన్ని మరిపించే సంసారం.... ఇవన్నీ ఆమె ఊహల్లో ఎప్పుడూ మెదుల్తూనే వుంటాయి. అవి ఊహలని, ఊహలు వాస్తవానికి చాలాచాలా దూరంగా వుంటాయని, మధ్య తరగతి కుటుంబంలో ఒక చేత కాని తండ్రికి, అభం-శుభం తెలియని తల్లికి పుట్టిన అంజలికి బాగా తెలుసు. అన్నీ తెల్సినా ఆమె ఆ అందమైన ఊహల్ని మనసారా ఆహ్వానిస్తుంది! ముఖ్యంగా మనసు పాడై పోయినప్పుడు బలవంతంగా ఆ ఊహల్ని ఆహ్వానించి వాటిలో మునిగి తేలుతూ తనను తాను మర్చి పోతుంది. అందమైన ఆ ఊహలు ఆమె మనసుకి ప్రశాంతతను చేకూరుస్తాయి. అలా రోజుకొక్కసారైనా ఊహల్లో తేలిపోతూంటే గాని ఆమె మనసు తేలికవదు. మనసుకి ఎంతో తృప్తినీ, ఉల్లాసాన్ని కలుగచేసే ఆ ఊహలంటే ఆమెకి చాలా ఇష్టం. అవి వాస్తవానికి దూరంగా వుంటే వుండనీ గాక! ఒక దివ్య ఔషధంలా పని చేసి మనసుని సంతోషపర్చే శక్తి వాటికి ఉన్నప్పుడు వాటిని తనెందుకు వదులుకోవాలి?!

తేలికైన మనసుతో అంజలి మెల్లిగా నిద్రలోకి జారుకుంది! తెల్లవారక ముందే, సూర్యోదయం కాక ముందే విశాలాక్ష్మి నిద్ర లేచి కాల కృత్యాలు తీర్చుకుని వంటింట్లో దేవుడి పూజ చేసుకుంటున్నది. అంజలి పెరట్లో నూతి దగ్గర అంట్ల గిన్నెలు తోముతున్నది. ఇంతలో రామనాథం లేచి పెరట్లోకి వచ్చేడు. కూతుర్ని చూడగానే ఆ విషయం జ్ఞాపకం వచ్చి అతని ముఖం సంతోషంతో వెడల్పయింది. నెమ్మదిగా కూతురు దగ్గరకి వచ్చి అటు - ఇటు ఎవ్వరూ లేరని నిర్ధారించుకుని నూతి గట్టు మీద కూర్చున్నాడు.

''అంజలీ!'' అని పిల్చేడు.

తలెత్తి చూసింది అంజలి. రాత్రి అలా తాగొచ్చినందుకు బాధపడ్తున్న సూచనలేవీ ఆ ముఖంలో కనబడ్డం లేదు. అంజలి చిన్నగా నిట్టూర్చింది.

''ఏమిటి నాన్నా?'' అంది అంజలి.

''అబ్బె. ఏం లేదూ. మొన్న నువ్వు ఇంటర్వ్యూ కెళ్లేవు చూసేవా. అతను నాకు బాగా తెల్సిన వాడేలే. నిన్న నేనతన్ని కలిసేను. అవునూ. ఇంతకీ నువ్వు ఇంటర్వ్యూ ఎలా చేసేవమ్మా?''

ఇంటర్వ్యూ చేసిన అధికారి నాన్నకి తెలుసు అనే సరికి ఆమె ఆశలకి కొత్త ఊపిరి వచ్చింది.

''బాగానే చేసేను నాన్నా!'' అంది అంజలి సంభ్రమంగా.

''ఏం లేదు. నేను వెళ్లి నీ సంగతి చెప్పేననుకో. అతను నిన్ను ఒకసారి రమ్మన్నాడు. నువ్వు కూడా ఓ మాటు అతన్ని కలుసుకో. ఎందుకైనా మంచిది!'' అన్నాడు రామనాథం.

అతని మాటల్లో గూడార్థం ఏదో గోచరించి గతుక్కుమంది అంజలి.

''నేనొక్కర్తినే ఎలా వెళ్లను నాన్నా? మీరు రండి నాతో''.

''అబ్బె. నేనెందుకు? ఈ రోజుల్లో ఆడపిల్లలు ఒక్కళ్లు వెళ్లి అడిగితేనే సులభంగా ఉద్యోగాలు దొరుకుతాయి''.

తండ్రి మాటలు బాగానే అర్థం అవుతున్నాయి అంజలికి.

''ఏంటి నాన్నా మీరంటున్నది?'' కఠినంగానే అంది.

''అవునమ్మా! ఎలాంటి ఎరువులు వేసేరన్నది ఎవరికీ అక్కర్లేదు. పూచే పువ్వు అందంగా వుంటే చాలు. ఉద్యోగం రావాలంటే వాళ్లక్కావల్సినది మనం ఇచ్చుకోవాలి''. నిర్లక్ష్యంగా అనేసి వెళ్లిపోయాడు.


''ఏమిటిది? కన్న కూతురుతో మాట్లాడవల్సిన మాట లేనా ఇవి?'' తండ్రి వైపు అసహ్యంగా చూసింది.

అసలు ఆ ఆఫీసరు ఏమనుకుంటున్నాడు తన గురించి? తనకి ఉద్యోగం వచ్చినా, రాకపోయినా ఫర్వాలేదు. ఉద్యోగాలని ఎర చూపించి అమ్మాయిల జీవితంతో ఆడుకునే ఇలాంటి కీచకులకి తగిన గుణపాఠం చెప్పాలి. 'ఆడది అబలకాదు' అని నిరూపించాలి. ప్రతీ ఆడపిల్లా బయటకు వెళ్లేటప్పుడు బ్లేడు, కారప్పొడి, సూదులు, డమ్మీ పిస్టలు లాంటి రక్షణాయుధాల్ని హేండ్ బ్యాగ్‌లో పెట్టుకుని వెళ్లాలి. ఏ మగాడైనా ఆమె జోలికి వస్తే అవన్నీ ఉపయోగించి తనను తాను రక్షించుకోవాలి.

తను వెళ్తుంది. అతనేదో అంటాడు. తనేదో అంటుంది. అతనికోపం వస్తుంది. అయినా తను భయ పడదు. అక్కడికి వెళ్లిన తర్వాత ఎలాంటి డైలాగులు ఉపయోగించాలో ఆలోచిస్తోంది అంజలి. ఆమె కళ్ల ముందు ఉద్యోగం కోసం వచ్చిన ఆడపిల్లల శీలాన్ని అపహరించిన ఎంతో మంది ఆఫీసర్ల ఉదంతాలు కదుల్తున్నాయి. ఆమె చెవుల్లో ఉద్యోగం అనే జీవితాధారం కోసం ఈ ద్విపాద పశువుల కామతృష్ణకి బలైపోతూ, చావలేక - బ్రతకలేక, ఛస్తూ బ్రతుకుతున్న ఎంతో మంది అబలల ఆర్తనాదాలు మార్మోగుతున్నాయి!

***

ఆఫీసరున్న గదిలోకి వెళ్లింది అంజలి. అన్నింటికీ తెగించే వెళ్లింది. అతనిని చూస్తుంటే వళ్లు



మండి పోతున్నది ఆమెకి. ఏం ఎరగనట్టు పైకి ఎంత నెమ్మదిగా వున్నాడు! ఇతగాడు నన్ను రమ్మ న్నాడా? నన్ను పంపించమని నాన్నతో చెప్పేడా? నాన్న వొప్పుకున్నారా? అందరూ మగాళ్లే. వాళ్ల బుద్ధులన్నీ ఒక్కలాగే వుంటాయేమో?! తన తండ్రి ఏం తక్కువ వాడు కాదు. సుగుణాకర చక్రవర్తి!.... ఏం ఎరగనట్టు కాగితాల్లో తలదూర్చి ఏదో పరపర రాసేసుకుంటున్నట్టు ఏక్షనూ వీడూను! అతన్ని చూస్తుంటే అరికాలి మంటనెత్తికెక్కు తోంది! అయినా తమాయించుకుంటూ సభ్యత కోసం ''నమ స్కారం సార్!'' అంది.

అతను తలెత్తి చూసేడు.

''సార్! నా కెలాగైనా ఈ ఉద్యోగం వచ్చేలా చూడండి'' అంది అంజలి.

అంత ధైర్యంగా లోపలికి అడుగు పెట్టిన అంజలి అతను కుర్చీలో ఏ మాత్రం కదిలినా, లేచి తన దగ్గరకొచ్చేస్తాడేమోనని భయంతో ఆమె చిగు రుటాకులా వణికి పోతున్నది. ''ఎంతో ధైర్యంతో సిచ్యుయేషన్ని ఎదుర్కొందామని వచ్చి ఇప్పుడిలా భయపడిపోతున్నావేంటి'' అనుకుంది నీరుగారి పోతూ. ఆమె మనసులోని ఆలోచనలు శరవేగంతో పరుగెడుతున్నాయి!.... అతను లేచి తన దగ్గర కొస్తాడు. భుజం మీద చేయి వేస్తాడు. తను వణికి పోతుంది. అతను అదోలా నవ్వుతాడు. తను అస హ్యంగా చూస్తుంది. కౌగిలించుకుని ముద్దు పెట్టు కుంటాడు. తను విదిలించి కొడ్తుంది. అతను రెచ్చి పోతాడు. చరచరా ఆ వెనక గదిలోకి లాక్కెళ్లి పోయి... తనని బలవంతంగా... అబ్బ ఊహించు కుంటుంటే విపరీతమైన భయం వేస్తున్నది. అంతా అయిపోయేక తను ఏడుస్తుంది. మొత్తుకుంటుంది. ఉద్యోగం ఇస్తానంటాడు. జీవితం నాశనం అయిపో యేక అలాంటి ఉద్యోగం తనకెందుకు? వద్దం టుంది. ప్రాణం పోయినా శీలం పోకూడదు. శీలం పోతే ప్రాణంతో వుండ కూడదని, చచ్చిపోవాలని నిశ్చయించుకుంటుంది!...

సడన్గా ఆమెకి తన హేండ్ బ్యాగ్ గుర్తొ చ్చింది. నో. అలా జరగడానికి వీల్లేదు. అసలు అతను దగ్గరగా వచ్చి భుజం మీద చెయ్యంటూ వేస్తే తను వూరుకుంటుందా పిరికి పందలా.. ఛ... నెవ్వర్! వెంటనే అతనిక్కనబడకుండా మెరుపులా తన బ్యాగులోంచి రక్షణాయుధాల్ని తీసి అతని మీద ప్రయోగించదూ!? ముందుగా ఏది ప్రయో గించాలి? ఏది? సూదులే సులభం. గట్టిగా గుచ్చె య్యాలి. ఆపైన బ్లేడు. తర్వాత కారప్పొడి... లేదు ముందే కారం కంట్లో పోసెయ్యాలి. కాదు... కాదు...!

చంద్రశేఖరం లేచేడు. అంజలికి భయంతో రోమాలు నిక్కబొడుచుకున్నాయి. తనెంత పొర పాటు పని చేసింది! పులి బోనులో అడుగు పెట్టేక పులి తినదు అని అనుకోవడం ఎంత అవివేకం! పులిని ఎదిరించి నిలబడ్డం అంతకంటే అసాధ్యం! తనసలు రాక పోవాల్సింది.

అతని ప్రతీ చర్యనీ ఎక్సరే కళ్లతో గమనించడం మొదలెట్టింది అంజలి. పాము ముంగిస వైపు చూసి నట్టు చూస్తున్నాది. చంద్రశేఖరం బార్లాతీసి వున్న ఛాంబర్ తలుపుల్ని దగ్గరకు వేసి వచ్చేడు.

''మీ నాన్న... నిన్ను పంపేడు కదూ!'' హఠా త్తుగా అన్నాడు అతను.

తెల్లబోతూ చూసింది అంజలి.

''మీరు... నన్ను... రమ్మన్నారట...'' అంది.

''అలా అని మీ నాన్న చెప్పేడు నీతో... అవునా?'' అన్నాడతను నవ్వుతూ.

అవునన్నట్టు భయంగా తలూపింది అంజలి.

''చూడు అంజలీ! మీ నాన్న నాతో ఏం చెప్పేడో తెలుసా?''

చెవులు రిక్కించి వింటున్నది అంజలి.

''రేపు మా అమ్మాయిని మీ దగ్గరకు పంపి స్తాను. తన నుంచి మీక్కావల్సిందే తీసుకున్నా నాకు అభ్యంతరం లేదు. కాని మీరెలాగైనా తనకి ఉద్యోగం ఇవ్వాలి అన్నాడు నా చేతులు పట్టుకుని బ్రతిమాలుతూ''.

''మీ నాన్న మాటలకి అర్థం నీకు ఈపాటికి తెలిసే వుంటుంది'' అతను మళ్లీ అన్నాడు.

''ఓహ్!'' చెవులు గట్టిగా మూసుకుంది అంజలి.

''మా... నాన్న... మీకు ముందునించీ తెలుసా?'' ధైర్యం చేసి అడిగింది అంజలి.

''తెలీదు. మీ నాన్నలాంటి వాళ్లు ఉంటారని కూడా అనుకోలేదు. ఉద్యోగం కోసం కన్న కూతుర్ని ఎరగా వేద్దామనుకునే కుత్సిత స్వభావం గల మీ నాన్నలాంటి వాళ్లని చూడ్డం ఇదే మొదటి సారి కూడా!''

కత్తి వేటుకి నెత్తురు చుక్కలేనట్టుగా అంజలి ముఖం పాలిపోయింది. అతని ముందు మొహం ఎత్తుకో లేక తలవంచుకుని నిలబడింది.

చంద్రశేఖరం ఆమె అవస్థ చూసి జాలి పడ్డాడు. ఆమెకి దగ్గరగా వచ్చేడు.

''చూడు అంజలీ! నువ్వు ఎంత భయపడుతు న్నావో నీ ముఖమే చెప్తున్నది. నువ్వు ఈ గదిలో అడుగుపెట్టిన దగ్గర్నుంచీ నేను నిన్ను గమనిస్తూనే వున్నాను. నీ ముఖానికి పట్టిన చెమట్లు, వణుకు తున్న నీ చేతి వేళ్లు, నీ భయాన్ని స్పష్టంగా తెలియ పరుస్తున్నాయి. ఉద్యోగం ఇస్తామని ఆశపెట్టి ఆడ పిల్ల శీలాన్ని అపహరించే దౌర్భాగ్యులు ఈ సమా జంలో ఉన్నంత కాలం నీ తండ్రి లాంటి చేతకాని వాళ్లు, పరాన్నభుక్కులు కూడా ఈ సమాజంలో ఉంటారు. నువ్వు భయ పడ్డంలో అసహజం ఏమీ లేదు. కాని ఒక్క విషయం అంజలీ!

నేను అలాంటి వాడిని కాను. టాలెంటుని బట్టి, ఉద్యోగార్హతని బట్టి ఉద్యోగం ఇస్తాను. నువ్వు భయపడకు. నిర్భయంగా, నిశ్చింతగా వుండు. నువ్వు ఇంటర్వ్యూ బాగా చేసేవు. నువ్వు సెలక్టు అయ్యేవు. ఈ ఉద్యోగం నీకు ఇస్తున్నాను. కాని ఒక్క మాట...'' అతను చెప్పడం ఆపేడు.

అంజలి ఊపిరి బిగపట్టి వింటున్నది.

''మానసిక విలువల్ని పెంపొందించుకుని ''మనిషి''గా బ్రతకమని, కుత్సితంగా ఆలోచించ వద్దని, బాధ్యత తెలుసుకుని బతకమని మీ నాన్నతో నేను చెప్పేనని... చెప్పు''. గంభీరంగా అన్నాడు చంద్రశేఖరం.

అంజలికి కళ్లంట జలజలా నీళ్లు రాలేయి. ఏడు పుని ఆపుకోలేక పోయింది. అది ఆనందమో, విషా దమో తెలియని పరిస్థితి!?!


అప్రయత్నంగా రెండు చేతులు జోడించి నమ స్కరిస్తూ అంది.

''సార్! మీరు మనిషి కాదు. దేవుడు సార్! నిజంగా దేవుడే!''

అతను చిన్నగా నవ్వేడు. ఆ చిరునవ్వు చల్లని కాంతులను విరజమ్ముతున్నట్టుగా అనిపించింది అంజలికి.

''అంత మాటనకు అంజలీ! నేను మనిషిని. నీతి తప్పని మామూలు మనిషిని! అంతే!''

★





చిరునామా:

శ్రీమతి న్యాయపతి కమలారాంజీ

వైఫ్ ఆఫ్ ఎన్.వి.రమణమూర్తి (రాంజి)

49-26-53, ఎస్-3 ప్రసీద రెసిడెన్సీ,

మొదటిలైన్ మధురానగర్,

విశాఖపట్నం - 530 016.

ఫోన్: 9392390211, 2790852.